## క్లుప్తంగా

### మొక్కల సంరక్షణకు కృషిచేయాలి

**నూతనకల్‌ :** ఎండలు తీవ్రత నేపథ్యంలో పల్లె ప్రకృతి వనాల్లో పెంచుతున్న మొక్కలను నిర్వాహకులు సంరక్షించాలని ఎంపీడీఓ సునీత కోరారు. బుధవారం మండల పరిధిలోని మిర్యాల, లింగంపల్లి, అల్లునూరు గ్రామాల్లో పల్లెప్రకృతి, వనసర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడటం కోసం నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు గ్రామాల్లో చెత్త సేకరణను చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆమె కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు అనిల్‌, నాగన్న, సోమేష్‌ తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న రామకోటి

**అర్వపల్లి :** మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గోదల వీరమ్మ అనారోగ్యంతో మంచం పట్టింది. ఆమె వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు డాక్టర్‌ తాడూరి రామకోటి బుధవారం తనవంతు సాయంగా రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట డాక్టర్‌ వెంకన్న, గంగదెరి వెంకట్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడికి పితృవియోగం

**అర్వపల్లి :** మండల పరిధిలోని నాణ్యతండా గ్రామపంచాయతీ ఆవాసం పూర్యతండాకు చెందిన బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు కేలోతు రవీందర్‌నాయక్‌ తండ్రి, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు కేలోతు టాకిర్యా(68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని జెడ్పీటీసీ దావుల వీర ప్రసాద్‌యాదవ్‌, మాజీ సర్పంచ్‌ గుగులోతు మాణిక్యం, బీఆర్‌ఎస్‌ నాయకులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

### శతాధిక వృద్ధుడు మృతి



నిమ్మల పిచ్చయ్య

**నాగారం :** మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు నిమ్మల పిచ్చయ్య (103) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి పనిచేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పిచ్చయ్య మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

### విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



విలపిస్తున్న రైతు శ్రీరాములు

**అర్వపల్లి :** విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు శ్రీరాములు అనే రైతు తన పాడి గేదెను మేత కోసం గ్రామ శివారులోని పొలంలోకి తోలుకెళ్లి మేపుతుండగా పొలంలోని విద్యుత్‌ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని, తాను నిరుపేదనని పాడి గేదే తన కుటుంబానికి ఆధారమని రైతు శ్రీరాములు విలపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

### మల్లయ్యకు నివాళి



మల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

**అర్వపల్లి :** మండల పరిధిలోని కుంచమర్తి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్‌ తండ్రి మల్లయ్య దశదిన కర్మను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొని మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ సర్పంచ్‌ ఉగ్గం ఉపేంద్ర లింగరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌ కాపా రవికుమార్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబ, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ.అబీద్‌, బూతం సాగర్‌, కొప్పుల క్రాంతిరెడ్డి, వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు ఉన్నారు.

# పంచాయతీ పాలన అస్తవ్యస్తం

- గ్రామాల వైపు కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
- పరిష్కారం కాని సమస్యలు
- నిధులు లేక ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు



మహ్మదాపురంలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

**పెన్‌పహాడ్‌ :** గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పంచాయతీల పాలన కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారి పాలనలో గ్రామాల్లో ఎక్కడి సమస్య అక్కడే దర్శనమిస్తూ అస్తవ్యవస్తంగా మారింది. గ్రామాల్లో ఎలాంటి పనులు చేయాలన్నా ప్రత్యేక అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ వారు ఫోన్‌లోనే సంప్రదించి మీరు చేయించండి అంటూ కార్యదర్శులపైనే పూర్తి భారం వేస్తున్నారు. దీంతో సమస్యలను పరిష్కరిద్దామని అనుకుంటే నిధులు లేక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. పెన్‌పహాడ్‌ మండలంలో పలు గ్రామాల్లో మిషన్‌ భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కార్యదర్శులు ట్యాంకర్ల ద్వారా మంచినీటి ప్రజలకు అందించారు. గ్రామాల్లో ఏదైనా సమస్య ఉందని ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్తే మీరు చేయండి మేమేం చేస్తాం అంటూ కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయా గ్రామాల కార్యదర్శులు వాపోతున్నారు.

**గ్రామాలకు వెళ్లని అధికారులు..**

గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. అయితే గ్రామస్తులు సమస్యలను పంచాయతీ కార్యదర్శుల దృష్టి తీసుకెళ్తే తమకేమీ సంబంధం లేదనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు గ్రామాల్లో వారానికి రెండు రోజులు కేటాయించాలని చెప్పినా వారు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఏమైనా సంతకాలు అవసరం ఉంటే ప్రత్యేక అధికారులు ఉన్న చోటుకు వెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు. తీరా ప్రతి సమస్యను మీరు పరిష్కరించకుండా మాకేందుకు చెబుతున్నారు. అంటూ కార్యదర్శులపై విరుచుకుపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**పంచాయతీల్లో నిధుల కొరత..**

పంచాయతీల నిర్వహణకు అవసరమైన వీధి దీపాలు, సింగిల్‌ ఫేజ్‌ మోటర్లు కాలిపోతే మరమ్మతులు చేయించడం, కార్మికులకు వేతనాలు లాంటి వాటికి మూడు నెలలుగా నిధుల్లేక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తమ వేతనాలను పంచాయతీ నిర్వహణకే వెచ్చించగా మరికొందరు వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేయిస్తున్నారు. ప్రత్యేక అధికారులు తమకు ఎలాంటి సహకారం అందించడం లేదని, వారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని కొందరు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

#### సమస్యలపై దృష్టిసారించాలి



అధికారులను వారంలో రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా గ్రామాలను సందర్శించి సమస్యలపై దృష్టిసారించాలి. ఎవరైనా అలా పాటించకపోతే పైఅధికారులకు తెలియజేస్తాం

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ పెన్‌పహాడ్‌

## కాసర్లపహాడ్‌ మోడల్‌ పోలింగ్‌ కేంద్రంలో 75శాతం



కాసర్లపహాడ్‌లో ఏర్పాటు చేసిన మోడల్‌ పోలింగ్‌ కేంద్రం

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్‌లో 129వ బూత్‌ను మోడల్‌ పోలింగ్‌ కేంద్రంగా ఏర్పాటు చేశారు. అలంకరణలోనే కాకుండా ఓటింగ్‌లోను ఆదర్శంగా ఉండాలలేది ఎన్నికల కమిషన్‌ లక్ష్యం కాగా ఈ కేంద్రంలో మొత్తం 779మంది ఓటర్లు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 585మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో 75.10శాతం పోలింగ్‌ నమోదైంది. కాగా ఇదే కేంద్రంలో అసెంబ్లీ ఎన్నికల నందు 98శాతం పోలింగ్‌ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరాజు, బీఎల్‌ఓ లింగంపల్లి రేణుకలు ప్రత్యేకంగా అలంకరించి ఓటర్లు ఆకర్షించేలా అందంగా తీర్చిదిద్దారు.

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి



కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

**చిలుకూరు :** గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. బుధవారం చిలుకూరు మండల పరిషత్‌ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో మండల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఓ నిర్మల, గ్రామ కార్యదర్శులు, టీఏలు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసిన కొత్తగూడెం వాసులు

**తుంగతుర్తి :** మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను గ్రామస్తులు కలిశారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలగడ అనురాధ కిషన్‌రావు మాట్లాడారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, నీటికోసం రెండు బోర్లు వేయించాలని, సీసీరోడ్లు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ డీఈఈని ఆదేశించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌, నాయకులు కాసర్ల గణేష్‌, అవుల కొమురెల్లి, వీరయ్య, వగలగాని సుదర్శన్‌, వెంకన్న, సైదులు, పరుశరాం, సతీష్‌, మైసయ్య, అంజయ్య, శ్రీను, సంతోష్‌ తదితరులు ఉన్నారు.

## మల్లమ్మ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మల్లమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

**పెన్‌పహాడ్‌ :** మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్‌, సీనియర్‌ నాయకురాలు గంటేపంగి మల్లమ్మ(69) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జ్‌ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మండలి జ్యోతి, పిచ్చయ్య, నారాయణ, ప్రవీణ్‌రెడ్డి, సైదులు, యోగి, సందీప్‌, బ్రహ్మచారి, నాగయ్య, ఉమామహేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నగేష్‌ ఉన్నారు.

**క్రైస్తవుల ఆధ్వర్యంలో..**

మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన పాస్టర్‌ ఇమ్మానియేల్‌ మాతృమూర్తి గంటేపంగి మల్లమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా పాస్టర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్‌ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బొక్క ఏలియరాజు, యల్క ప్రభాకర్‌, కొండేటి లాజర్‌ తదితరులు ఉన్నారు.

## మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలి

**నూతనకల్‌ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్‌ అభ్యర్థి తీన్మార్‌ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ అరాచకాలను క్యూన్యూస్‌ ద్వారా ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసి కాంగ్రెస్‌ అధికారంలోకి రావడానికి కృషి చేసిన తీన్మార్‌ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దరిపెల్లి వీరన్న, కళ్లెం కృష్ణారెడ్డి, బాణాల సుదర్శన్‌రెడ్డి, లింగాల రామచంద్రు, బత్తుల నాగమల్లు, సురుగు రామచంద్రు, రాచకొండ అయోధ్య, తొనుకునూరి సైదులుగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న దాత అంబేద్కర్‌

**మునగాల :** మండల పరిధిలోని ముకుందాపురం వృద్ధాశ్రమంలో బుధవారం తాడ్వాయి గ్రామానికి చెందిన మాతంగి అంబేద్కర్‌ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లేపల్లి సైదిబాబు, ఆశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అలంకారప్రాయంగా హైమాస్ట్‌ లైట్లు





సబ్‌మార్కెట్‌ యార్డులో మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న హైమాస్ట్‌ లైట్లు

- అంధకారంలో వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

**అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం గ్రామశివారులోని వ్యవసాయ సబ్‌మార్కెట్‌ యార్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. యార్డు ఆవరణలో గతంలో ఏర్పాటు చేసిన లైట్లు వెలగకపోవడంతో రాత్రి అంధకారంగా మారుతుంది. యార్డులో చుట్టూ ప్రత్యేక స్తంభాలను బిగించి హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేసిన కొద్ది రోజులు మాత్రమే వెలిగాయి. అనంతరం యార్డు నిర్వహణ ఎవరూ పట్టించుకోకపోవడంతో కొన్ని స్తంభాలకు ఉన్న లైట్లు వేలాడుతుండగా మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఈ యార్డులో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు చీకట్లోనే యార్డులో ధాన్యం కాపలా ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా యార్డు అధికారులు స్పందించి హైమాస్ట్‌ లైట్లకు వెంటనే మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

# మూసీ రోడ్డుకు మోక్షం కలిగేనా !



కాసనగోడు వద్ద బురదమయంగా మూసీ రోడ్డు



కేతేపల్లి శివారులో ఇలా..

- కాసనగోడు నుంచి మూసీ ప్రాజెక్టు వరకు అధ్వానంగా రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, విద్యార్థులు
- బీటీగా మార్చాలని వేడుకోలు

**కేతేపల్లి:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్‌ తర్వాత అతి పెద్ద సాగునీటి వనరుగా పేరుగాంచిన మూసీ ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు కేతేపల్లి నుంచి సరైన రోడ్డుమార్గం లేదు. దీంతో మూసీ పరిసర గ్రామాల ప్రజలు, ప్రాజెక్టును వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేతేపల్లిలోని మూసీ కుడి ప్రధాన కాల్వ వెంట కొత్తపేట, కాసనగోడు, బొప్పారం గ్రామాల మీదుగా ప్రాజెక్టు వరకు 13 కి.మీ దారి గతంలో మట్టి రోడ్డుగా ఉండేది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి కనీసం నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి ఉండేది. మండల ప్రజలు పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు కేతేపల్లి నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న కాసనగోడు శివారు వరకు మూసీకుడి కాల్వవెంట బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు మూడు 3కి.మీ మట్టి రోడ్డును అలాగే వదిలేశారు. నాటినుంచి మట్టిరోడ్డు నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో మోకాలి లోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. కేతేపల్లి నుంచి కాసనగోడు శివారు వరకు పదేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు సైతం నిర్వహణ లేకపోవడంతో గుంతలు పడి నడవడానికి కూడా వీల్లేకుండా మారింది.

**కాల్వ కట్టే రోడ్డు మార్గం..**

కాసనగోడు గ్రామం నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో మూసీ కుడి కాల్వ కట్టపై నుంచే ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. కాసనగోడు, బొప్పారం గ్రామాల రైతులు ప్రాజెక్టు సమీపంలో ఉన్న తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాలంటే ఈ కట్టపై నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు తమ ధాన్యాన్ని ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇళ్లకు తరలించేందుకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాకాలంలో వరదలు వచ్చి మూసీగేట్లు ఎత్తిన సమయంలో మండల కేంద్రం నుంచి వెళ్లే సందర్శకులు, ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది, అధికారుల బాధలు అన్నీఇన్నీ కావు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కాసనగోడు నుంచి ప్రాజెక్టు వరకు నడక దారే శరణ్యంగా మారింది.

**గురుకుల విద్యార్థులకు ఇబ్బందే..**

మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు మార్గం లేకపోవడంతో ప్రాజెకు వద్ద ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఈ పాఠశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల వరకు బీటీ రోడ్డు మార్గం లేకపోవడంతో బస్సు సౌకర్యం లేక ఇక్కడకు వచ్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మూసీ ప్రాజెక్టు వరకు బీటీ రోడ్డు నిర్మించి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

#### బీటీ రోడ్డుగా మార్చాలి



ప్రాజెక్టు వరకు రోడ్డు ఉన్న మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో కాలి నడకన వెళ్లేందుకు కూడా వీలు కావడం లేదు. మూసీ సందర్శనకు వెళ్లే వాహనదారులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు కాల్వ కట్టపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. పాలకులు స్పందించి మూసీ ప్రాజెక్టు వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీగా మార్చాలి.

– కర్ర ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌, బొప్పారం

#### ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి



కేతేపల్లి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డును అభివృద్ధి చేసినట్లయితే మూసీ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుంది. గురుకుల పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులు ఇబ్బందులు తొలగుతాయి. ఈ ప్రాంత ప్రజాప్రతిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మూసీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషిచేయాలి.

– రాచకొండ గోపి, గుడివాడ

## ఉద్యానవన రైతులను ఆదుకోవాలి

**నడిగూడెం :** ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి, నిమ్మ రైతులను ఆదుకోవాలని పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బుధవారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా అకాల వర్షాలు, ఈదురు గాలులకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సంబంధిత అధికారులను స్పందించి క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి రైతుల కు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

## 19న మిర్యాలగూడలో 'జల్సా'

**మిర్యాలగూడ :** మిర్యాలగూడ పట్టణంలోని ఉస్మానియా మసీద్‌లో మౌలాన అతికుల్‌ రెహమాన్‌ ఆధ్వర్యంలో ఈనెల 19న అజీమిస్‌ షాన్‌జల్సా నిర్వహిస్తున్నట్లు మత పెద్దలు హఫిజొద్దిన్‌ పాషా, అహ్మద్‌ చావుష్‌ తెలిపారు. బుధవారం స్థానిక ఉస్మానియా మసీదులో జల్సా పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జల్సాకు గుజరాత్‌కు చెందిన మత పెద్దలు మౌలానా సలావుద్దిన్‌సైఫీ పాల్గొంటారన్నారు. 19న సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఈ జల్సా కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్‌, అంజాద్‌ బాబా, తౌఫిక్‌, కమిటీ సభ్యులు మొహమ్మద్‌ రఫీక్‌, హఫీజ్‌, అబ్దుల్‌ మన్నాన్‌, పాషా, షఫి, జుబేర్‌, సాధిక్‌, షరీఫ్‌, సుల్తాన్‌ పాల్గొన్నారు.

## నారాయణఖేడ్‌ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

**నేరేడుచర్ల :** ఉపాధ్యాయులపై లాఠీచార్జ్‌ చేయించిన నారాయణఖేడ్‌ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌ యూటీఎఫ్‌ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యడవల్లి కృష్ణయ్య, బుడిగే అక్కయ్యబాబులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్‌ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జ్‌ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

# బీటీరోడ్డుగా మారేదెప్పుడో..

- మట్టిరోడ్డుతో ఇబ్బందులు పడుతున్న రాజగానితండా వాసులు
- వర్షాకాలంలో ప్రయాణించాలంటే అవస్థలు
- సమస్యను పరిష్కరించాలని వేడుకోలు



బీటీకి నోచుకోని రాజగానితండా- కుక్కడం రోడ్డు

**మద్దిరాల :** ప్రభుత్వాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పలు గ్రామాలకు వెళ్లే లింక్‌రోడ్లు మట్టిరోడ్లతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని కుక్కడం ఆవాసం రాజగానితండాకు వెళ్లే మట్టిరోడ్డులో ప్రయాణించాలంటే తండవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు బీటీ రోడ్డుగా మారేదెప్పుడోనని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. గుంతలమయంగా మారిన దారుల్లో ప్రయాణించలేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

**బీటీకి నోచుకోక..**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా తమ బతుకుల్లో మార్పు రావడంలేదని తండవాసులు వాపోతున్నారు. వానాకాలం వచ్చిందంటే చాలు విద్యార్థులు, వృద్ధులు ఈ మట్టిరోడ్డు గుండా వెళ్లాలంటే బురదతో అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో గుంతలమయంగా మారి ద్విచక్రవాహనాల రాకపోకలు సైతం నిలిచిపోతున్నాయి. గతంలో బురదమయంగా మారిన రోడ్ల గుండా వెళ్తున్న పలువురు జారిపడి గాయాలైన సంఘటనలు కూడా ఉన్నాయి.

**తండాలన్నింటికీ మట్టి రోడ్లే..**

మండలంలోని ఆయా గ్రామపంచాయతీల పరిధి నుంచి తండాలకు వెళ్లే రోడ్లన్నీ చాలా వరకు మట్టి రోడ్లే ఉన్నాయి. కొన్ని తండాలకు ఇటీవల రోడ్లను మంజూరు చేసినప్పటికీ ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో మరమ్మతులు చేపట్టలేదు. వర్షాకాలంలో ఈ మట్టిరోడ్ల గుండా ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా తండాలకు వెళ్లే మట్టిరోడ్లను బీటీరోడ్లుగా మార్చాలని పలు తండాల వాసులు కోరుతున్నారు.

#### వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం



తండాకు మట్టిరోడ్డు గుండా వర్షాకాలంలో వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా ఎక్కడ జారి పడతామోనని భయాందోళన కలుగుతుంది. మండల కేంద్రానికి ఎరువుల కోసం, పిల్లలను స్కూళ్లకు పంపాలన్నా ఇబ్బందిగా మారుతుంది. తండాకు ఆటోలు కూడా రావడం లేదు. వైద్యానికి వెళ్లాలన్నా, ఎరువులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు.

– మోహన్‌, రాజాగానితండా

#### బీటీగా మార్చాలి



తండాలకు రవాణా సౌకర్యం బాగున్నప్పుడే అభివృద్ధి చెందుతాయి. రోడ్లు బాగుంటేనే రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ప్రస్తుతం రవాణా సౌకర్యం సరిగా లేక తండాలలో ప్రజలకు మెరుగైనా వైద్యం, విద్య, ఇతర సౌకర్యాలు సమకూరడం లేదు. అధికారులు స్పందించి తండాల మట్టిరోడ్లను బీటీరోడ్లుగా మార్చి సమస్యను పరిష్కరించాలి.

– లకావత్‌ తరుణ్‌, రాజాగానితండా